# సార్క్‌కు సవాళ్లు ఎన్నో... !

**దక్షిణాసియా దేశాల మధ్య పరస్పర సహకారం కోసం ఏర్పడిన సంస్థ'దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్). 1985 డిసెంబర్‌లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో 'సార్క్' రూపుదాల్చింది. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మాల్దీవులు, అఫ్గానిస్తాన్‌లు సభ్య దేశాలు. దీని సచివాలయం నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో ఉంది. ప్రస్తుతం దీనికి చైర్మన్‌గా శ్రీలంక వ్యవహరిస్తోంది.**

దక్షిణాసియా దేశాల ప్రజలకు నాణ్యమైన జీవనం, వారి సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా సార్క్ ఆవిర్భవించింది. ఆర్థిక వృద్ధి, సాంఘిక, సాంస్కృతిక రంగాల వృద్ధిని బలోపేతం చేయడం.. సభ్య దేశాల మధ్య స్నేహ సౌభ్రాతృత్వాలని నెలకొల్పడం, సమస్యలపై పరస్పర సహకారం, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో సంబంధాలను మెరుగుపర్చుకోవడం.. సభ్య దేశాల క్షేమం కోసం ఉమ్మడి అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో చర్చల దిశగా పరస్పర సహకారం.. సార్క్ ఇతర లక్ష్యాలు.

## సార్క్ స్వరూపం..

ప్రస్తుతం సార్క్ దేశాల జనాభా 1.4 బిలియన్లు . ప్రపంచ జనాభాలో ఇది ఐదో వంతు.ఇక్కడి ప్రజల సగటు వార్షిక ఆదాయం 450 డాలర్లు. ఇంత స్థాయిలో జనాభా ఉన్న ఈ ప్రాంతంలో ప్రాంతీయ వాణిజ్యం, క్రాస్- బోర్డర్ పెట్టుబడులకు చక్కని అవకాశాలున్నాయి. దురదృష్టవశాత్తూ సార్క్ దేశాల మధ్య వాణిజ్యం ఐదు శాతం కంటే తక్కువగా ఉంది. ప్రపంచంలోని పేద ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. ప్రపంచంలోని పేద జనాభాలో 44 శాతం మంది ఇక్కడే ఉన్నారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దక్షిణాసియా ప్రాంతంలో 500 మిలియన్ ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ప్రపంచంలోని బాల కార్మికుల సంఖ్యలో 50 శాతానికిపైగా ఈ ప్రాంతం వారే.

## ప్రాంతీయ సహకార అవశ్యకత..

ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండాలంటే ప్రాంతీయ సహకారం తప్పనిసరి. అది సరిగా లేకుండానే సార్క్ దేశాలు ముందుకెళుతున్నాయి. మరోవైపు యూరోపియన్ యూనియన్, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఉత్తర అమెరికా దేశాల్లోని ప్రాంతీయ ఆర్థిక సంస్థల్లో సమైక్యత అభిలషణీయంగా ఉంది. ప్రాంతీయ వాణిజ్య వృద్ధి, ఇతర దేశాలతో పోటీలో ఆ ఆర్థిక



సంస్థలు ఎన్నో విజయాలు సాధించాయి. సార్క్‌కు ఆ స్థాయి విజయాలు లేవు. ఈ సమస్యను అధిగమించాలంటే సభ్యదేశాల మధ్య రాజకీయ ద్వేషాలు, అనుమానాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. వాణిజ్య సహకారానికి నాంది పలకాలి. ఈ క్రమంలోనే 1995లో రూపొందిన 'సార్క్ ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందం (సాప్టా- SAPTA)'.. 'దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతంగా (సాఫ్టా- SAFTA)' 2006 జనవరి 1న ఆవిష్కృతమైంది.

## 'సాఫ్టా' అంటే...

సార్క్ సభ్య దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యానికి ఊతమివ్వడమే సాఫ్టా ముఖ్యోద్దేశం. దక్షిణాసియా మార్కెట్‌ను సమైక్య పరిచి.. ఈ ప్రాంత వాణిజ్యాన్ని ఒకతాటి కిందకి తీసుకురావాలి. సార్క్ చరిత్రలో సాఫ్టా ఒప్పందం ఓ మైలురాయి. 'సాఫ్టా'లో పేర్కొన్న టారిఫ్‌లకు మార్పు చేర్పులు చేసి సాఫ్టా ద్వారా కొత్త దిశను నిర్దేశించారు. దీంతో దక్షిణాసియా ప్రాంతంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి తద్వారా ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి, ప్రపంచ దేశాలతో పోటీ పడటానికి సాఫ్టా దోహదపడాలి. సభ్యదేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం ఏడు బిలియన్ డాలర్లుంది. సాఫ్టా ఫలితంగా ప్రతి ఐదేళ్లకు అది రెట్టింపవుతుందని అంచనా. అధిక స్థాయిలో ఉన్న టారిఫ్‌లు తగ్గుతాయని ఆశాభావం నెలకొంది. దక్షిణాసియాలో... ముఖ్యంగా భారత్, పాక్ మధ్య నెలకొన్న ఆందోళనలను రూపుమాపి పరిస్థితిని ఆహ్లాదకరం చేసే శక్తి సాఫ్టాకి ఉందని కూడా ఓ వాదన. భారత వాణిజ్య, పారిశ్రామికవర్గాల అంచనా ప్రకారం.. సాఫ్టా వల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో దక్షిణాసియా కీలక పాత్ర పోషిస్తుంది. సభ్య దేశాల పరస్పర ప్రయోజనాలకి, పారిశ్రామిక పునర్నిర్మాణానికి సాఫ్టా దోహద పడుతుంది. దీని ప్రకారం శ్రీలంక రబ్బర్ హబ్‌గా, బంగ్లాదేశ్ శక్తి సంబంధ పరిశ్రమలకు కేంద్రంగా, భూటాన్ అటవీ ఆధార పరిశ్రమలకు కేంద్రంగా మారతాయి.

## సాఫ్టా పరిమితులు..

సాఫ్టా ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. అందులోనూ కొన్ని పరిమితులున్నాయి. కస్టమ్స్ యూనియన్ లేదా ఎకనమిక్ యూనియన్ గురించి

SAKSHI

వివరించకపోవడం, సేవల రంగంలో స్వేచ్ఛా వాణిజ్యం గురించి విస్మరించడం ముఖ్య లోపాలు. వీటితోపాటు సాఫ్టా విజయానికి అవసరమైన ఎన్నో కీలక అంశాలను చర్చించలేదు. ఉత్పత్తి నియమాలను రూపొందించకపోవడం, ప్రతికూల, సున్నిత అంశాల ప్రస్తావన లేకపోవడం... కస్టమ్స్ సుంకం ఎత్తివేతతో ఎల్.డి.సి.(లీస్ట్ డెవలప్డ్ కంట్రీస్- పేద దేశాలు)లకు తలెత్తే రెవెన్యూ నష్టాలకు పరిహారంగా ఏర్పాటు చేయాల్సిన నిధి గురించి వివరించకపోవడం కూడా ఇతర లోపాలు.

## సార్క్ ప్రగతికి అవరోధాలు...

ప్రాంతీయ సమగ్రత కోసం ఇప్పటి వరకు సార్క్ చేపట్టిన చర్యలు నిరాశాజనకం. ఈ సదస్సులు కేవలం చర్చా వేదికలుగానే మిగిలిపోతున్నాయి. భారత్, పాక్‌ల మధ్య సంబంధాలు సరిగా లేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం. దీనివల్ల ప్రతి విషయాన్ని డేగకళ్లతో క్షుణ్ణంగా పరిశీలించాల్సి వస్తోంది. అటు పాకిస్థాన్ వాణిజ్య సరళీకరణ కంటే కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తేందుకే సార్క్ సదస్సులను వినియోగించుకుంటోంది. రాజకీయ అంశాల పరిష్కారం లేకుండా ఆర్థిక ప్రగతి సాధ్యపడదని వాదిస్తోంది. ప్రపంచంలోని ఇతర ప్రాంతీయ సదస్సులకు, సార్క్‌కి ప్రధాన తేడా ఇదే. ఆయా సదస్సుల్లోని సభ్య దేశాలు రాజకీయ విభేదాలను విస్మరించి ఆర్థిక సహకారం పెంచుకుంటున్నాయి. పాకిస్థాన్ తన వాదనను ఎంతో కాలం వినిపించే అవకాశం లేదు. మరోవైపు భారతదేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం, బలం కారణంగా సభ్యదేశాల్లో కొన్ని అపోహలు నెలకొన్నాయి. దక్షిణాసియా మార్కెట్‌పై ఆధిపత్యం చెలాయించేందుకు సార్క్‌ను భారత్ వినియోగించుకునే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నాయి. సార్క్‌లోని పెద్ద దేశాలన్నీ అత్యధిక దిగుమతి సుంకాల ఆధారంగా బలీయంగా మారుతున్నాయి. అందువల్ల ఆ దేశాలు స్వేచ్ఛా వాణిజ్యంపట్ల విముఖత చూపుతున్నాయని విశ్లేషకుల అంచనా. సార్క్ దేశాలు విడివిడిగా చేపట్టే వాణిజ్యం వల్ల కలిగే ప్రయోజనాలు చాలావరకు ఒకే విధంగా ఉంటున్నాయి.

## తీవ్రవాదమే ప్రధాన అంశం..

శ్రీలంక రాజధాని కొలంబోలో ఆగస్టు 2, 3 తేదీల్లో జరిగిన 15వ సార్క్ సదస్సులో.. అన్ని దేశాల ప్రధాన మంత్రులు తీవ్రవాదం పైనే చర్చించారు. తీవ్రవాదం వల్ల శాంతి, అభివృద్ధికి విఘాతం కలుగుతోందని ముక్తకంఠంతో అన్నారు. భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్ కీలక ప్రసంగం చేశారు. ఆశించిన రీతిలో దక్షిణాసియా ముందుకెళ్లడం లేదని విచారం వెలిబుచ్చారు. ఈ ప్రాంత సుస్థిరత, ప్రగతికి తీవ్రవాదమే ప్రధాన అవరోధంగా వర్ణించారు. సామాజిక సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసే తీవ్రవాదం, పగలపై పోరాటాన్ని ఆపకూడదని స్పష్టం చేశారు. ఏసియాన్ (ASEAN)ను సార్క్ దేశాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తీవ్రవాదులు సరిహద్దుల్లేకుండా దుశ్చర్యలకు పాల్పడుతున్నారని... కాబూల్ లోని భారత రాయబార కార్యాలయంపై దాడి, బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లో వరుస బాంబు పేలుళ్లే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే సార్క్ దేశాలు ఉమ్మడి వ్యూహ రచన చేయాలన్నారు. ఈసారి సార్క్ సదస్సులో కీలక ఘట్టం.. పరస్పర న్యాయ సహకార ఒప్పందం (ఎంఎల్ఎటి). ఇది అమల్లోకి రావడానికి సభ్య దేశాలు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. తీవ్రవాదం, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడమే ఈ ఒప్పందం లక్ష్యం. నేరస్థులను, తీవ్రవాదుల్ని అప్పగించేందుకు ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. ఇప్పటికే రూపొందించిన ఇలాంటి చట్టాలు ఇంకా ఆచరణలోకి రాని నేపథ్యంలో కొత్త ఒప్పందానికి ప్రాముఖ్యత ఏర్పడింది.

## కొలంబో ఒప్పందం ముఖ్యాంశాలు..

సార్క్ సమావేశాల ముగింపు సందర్భంగా 'మన ప్రజల అభివృద్ధి కోసం భాగస్వామ్యం' పేరిట కొలంబో డిక్లరేషన్‌ను రూపొందించారు. తీవ్రవాదంపై పోరు దిశగా సహకారం... ముఖ్యంగా సమాచార మార్పిడిలో అది అవసరమని పేర్కొన్నాయి.

ముఖ్యాంశాలు.. అంతర్జాతీయ చట్టాలన్నిటినీ వినియోగించి న్యాయవ్యవస్థని బలోపేతం చేయాలి. తద్వారా తీవ్రవాదంపై పోరు సాగించాలి. అంతర్జాతీయ తీవ్రవాదంపై ఐక్య రాజ్య సమితి ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకోవాలి. (తీవ్రవాదంపై పోరు విషయంలో ఐరాస ముందు భారత్ ఇప్పటికే ఓ నివేదికను పెట్టింది. అయితే తీవ్రవాదంపై నిర్వచనం విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో అది ఇంకా తుది రూపు సంతరించుకోలేదు.) సేవా రంగంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగించాలన్న 'సాఫ్టా' నిర్ణయంపై నేతలు సానుకూలత వ్యక్తం చేశారు. పెట్టుబడుల అభివృద్ధి, సంరక్షణపై లిఖితపూర్వక ఒప్పందాలు రూపొందించాలని సూచించారు.సార్క్ మధ్యవర్తిత్వ మండలిని కూడా వీలైనంత త్వరలో రూపమివ్వాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో సార్క్ దేశాలను ఒక శక్తిగా రూపొందించేందుకు సాఫ్టాను అమలు చేయడంపై అంకిత భావాన్ని వ్యక్తం చేశాయి. వాణిజ్య సరళీకరణకు ప్రధాన అడ్డంకులపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సాఫ్టా అధికారులు రూపొందించిన సున్నిత వస్తువుల జాబితాను వీలైనంత త్వరగా సరిదిద్దాలన్నారు.

## అభివృద్ధి..

ప్రాంతీయ, ఉప ప్రాంతీయ ప్రాజెక్టులను అమలు చేయడంలో మరింత దృష్టి సారించాలి. ప్రతి దేశం కూడా ఒక ఉప ప్రాంతీయ ప్రాజెక్టును చేపట్టాలి. మూడు వందల మిలియన్ డాలర్ల కార్పస్ ఫండ్‌తో తలపెట్టిన సార్క్ అభివృద్ధి నిధి (ఎస్.డి.ఎఫ్.)కి త్వరగా ఆమోదముద్ర వేయాలి. అందుబాటులో ఉన్న నిధులతో ఎస్.డి.ఎఫ్. కార్యకలాపాలు ప్రారంభించాలి.

## సవాళ్లివే...

ఎన్ని ముసాయిదాలు రూపొందించినా.. ఒకే దృష్టి, ఒకే లక్ష్యంతో అడుగులేస్తేనే సార్క్‌కు విశ్వసనీయత. 'ప్రపంచంలో అత్యధిక

యువశక్తి ఉన్న దేశాలుగా, కొనుగోలు శక్తి, వేల సంవత్సరాల క్రితమే నాగరిక సంస్కృతికి నిలయమైన దేశాలుగా' సార్క్ దేశాలను మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ణించారు. సామాజిక ఆర్థిక అభివృద్ధి, శాంతి, సామరస్యాన్ని పెంపొందించడానికి ఈ ప్రాంతం ఎంతో అనువైందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే పేదరికం, తీవ్రవాదంపై పోరు సార్క్ దేశాల ముందున్న ప్రధాన సవాళ్లు. ముందుగా భారత్, పాక్ మధ్య రాజకీయ సంబంధాలు మెరుగుపడాలి. ఎల్.డి.సి.ల ఆర్థిక అభద్రతను తొలగించాలి. ఇందుకోసం భారత్, పాక్ వంటి దేశాలు వాణిజ్య రాయితీలు కల్పించాలి. ఇప్పటికే భారత్ వాటిని ప్రకటించింది. ప్రాథమిక ఆర్థిక సదుపాయాలు కల్పించడమూ ముఖ్యమే. సున్నిత ఉత్పత్తులపై టారిఫ్‌లు కూడా తగ్గించాలి. ఉదాహరణకు భారత్‌లో టీ పరిశ్రమ, బంగ్లాదేశ్‌లో టెక్స్‌టైల్, పాకిస్తాన్‌లో లైట్ ఇంజినీరింగ్ పరిశ్రమలు సాఫ్టా వల్ల నష్ట పోతాయి. కస్టమ్స్ యూనియన్‌ను ఏర్పరచి ఆపై ఎకనమిక్ యూనియన్ వైపు అడుగులు వేస్తేనే సాఫ్టా ఉద్దేశాలు నెరవేరుతాయి.

SAKSHI